క్లుప్తంగా

13న ఏలూరు మండల సర్వసభ్య సమావేశం

దెందులూరు: ఏలూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 13న ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సూర్యనారాయణ రాజు అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వి.శ్రీలత తెలిపారు. ఎంపీటీసీలు అన్ని శాఖల అధికారులు విధిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

బాల బాలికల రక్షణకు జాగ్రత్తలు తప్పనిసరి



రికార్డులను పరిశీలిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): బాల బాలికలు రక్షణ, విద్య, ఆహార విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆదేశించారు. రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం రత్నప్రసాద్ స్థానిక విద్యానగర్‌లోని శిశు గృహాన్ని సందర్శించారు. శిశు గృహంలోని బాల బాలికల ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. బాల, బాలికల రక్షణ, ఆహార విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, ఉన్నత శిఖరాలకు చేరేలా సొంత బిడ్డల్లా చూసుకోవాలని ఆదేశించారు. రికార్డులు, సిబ్బంది హాజరు పట్టీలను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో శిశు గృహ మేనేజరు కె.భార్గవి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ‘కిశోర బాలికా వికాసం’



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలిక

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, బాల్యవివాహాలపై అవగాహన కల్పించామని ఉభయ గోదావరి జిల్లాల ఆర్‌జేడీ సుజాత అన్నారు. మంగళవారం ఏలూరు గాంధీనగర్ మున్సిపల్ హై స్కూల్‌లో కిశోర వికాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌జేడీ సుజాత మాట్లాడుతూ గత నెల 2 నుంచి 10వ తేది వరకు కిశోర బాలికల వికాసం కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. బాలికలు వ్యాయామం, క్రీడలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శారత, డీసీపీఓ సూర్యచక్ర వేణి, సీడీపీఓ విజయలక్ష్మి, మల్లిక, డాక్టర్ శశాంక్, 41వ డివిజన్ ఇన్‌చార్జి జాగాని సంతోషి, సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

మాదిగ లాయర్స్ ఫెడరేషన్ సమావేశం



హాజరైన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా మాదిగ లాయర్స్ ఫెడరేషన్ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం ఏలూరులో నిర్వహించామని ఇన్‌చార్జి కూచిపూడి సత్యం మాదిగ తెలిపారు. జిల్లాలోని గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి జూలై 7న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అడ్వకేట్లు పింగుల భద్రం, మట్టా విద్యార్థి, ఎస్ గంగాధర్, ఎన్ రాము, ఇ.సాగర్, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, రాష్ట్ర నాయకులు కాశీ కృష్ణ, ఎంఎస్‌పీ ఏలూరు జిల్లా అధ్యక్షులు కందుల రమేష్, ఎంఎస్‌పీ ఏలూరు జిల్లా అధ్యక్షులు కందుల రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి మురళీకృష్ణ మాదిగ, నాయకులు చింతాటి కిషోర్, చొదిమెళ్ల రాంబాబు, ఎస్ బాలరాజు పాల్గొన్నారు.

30 రోజుల్లో సంపూర్ణ పారిశుద్ధ్యానికి కృషి

కలెక్టర్ వెట్రిసెల్వి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రానున్న 30 రోజుల్లో ఏలూరు నగరంలో పారిశుద్ధ్యం పూర్తిస్థాయిలో మెరుగుపడాలని, ఈ మార్పు నేటి నుంచే మొదలుకావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి నగరపాలక సంస్థ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్లు, పౌరుల ఫిర్యాదుల పరిష్కారం, అభివృద్ధి పనులపై స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆమె సమీక్షించారు. పారిశుద్ధ్యానికి సిబ్బంది, పర్యవేక్షణ అధికారులు, వాహనాలు ఉన్నప్పటికీ ఏలూరు నగరంలో ప్రతి చోటా అపరిశుభ్రం కనిపించడం శోచనీయమని, ఇటువంటి పరిస్థితి తప్పనిసరిగా మారాలని అన్నారు. నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బందికి 30 రోజులు సమయం ఇస్తున్నానని, నగరంలో రోడ్లపై ఎక్కడా చెత్త కనపడకుండా చేయలన్నారు. 30 రోజులు అనంతరం పారిశుద్ధ్యం, విధుల ప్రగతిలో చివరి రెండు స్థానాల్లో నిలిచిన వారిని తొలగిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. నగరంలో చెత్త ఎక్కువగా వచ్చే కల్యాణ మండపాలు, మార్కెట్లు, హోటల్స్, రెస్టారెంట్లు, వాణిజ్య దుకాణాల నిర్వాహకులు చెత్తను నగరపాలక సంస్థ వాహనాలకు అందించాలని, అలా కాకుండా రోడ్లపై వేసి అపరిశుభ్ర పరిస్థితులు కల్పించే వారికి నోటీసులు జారీచేయాలని, చెత్తను రోడ్లపై వేసే వారికి నోటీసులు జారీ చేసి, పెనాల్టీలు విధించాలన్నారు. పౌర సేవలపై ఫోన్ నెంబర్ 08812 – 232101తో ప్రత్యేక ఫిర్యాదు నమోదు విభాగాన్ని ఏర్పాటు చేశామని కార్పొరేషన్ కమిషనర్ కలెక్టర్‌కు వివరించారు. ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, అదనపు కమిషనర్ చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి.సురేఖ, మునిసిపల్ ఇంజినీర్ జి.సురేంద్రబాబు, టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావు, కార్యాలయ మేనేజర్ మూర్తి, రెవిన్యూ అధికారి నాగరాజు, ప్రభృతులు పాల్గొన్నారు.

చిన్నారులకు చదువే ఆస్తి



వాల్‌పోస్టర్ విడుదల చేసిన హరికృష్ణ

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): దళిత చిన్నారులకు చదువునే ఆస్తిగా తల్లిదండ్రులు ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్, రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పొలిమేర హరికృష్ణ కోరారు. శనివారపుపేట గవరవరం దళితవాడలో విద్యా ఆవశ్యకత గ్రామ బాట కార్యక్రమాన్ని హరికృష్ణ తదితరులు నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగపరంగా సంక్రమించే విద్య, వైద్య, ఇతర ఉపాధి రంగాల్లో రాణించాలంటే ప్రభుత్వం అందించే విద్యా సౌకర్యాలను అందిపుచ్చుకుని దళిత చిన్నారులంతా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు మాట్లాడుతూ విద్య మూడో నేత్రం ప్రతి దళితుడు కలిగి ఉండాలని, పాలేరు, కూలీ పనులకు స్వస్తి చెప్పి విద్య మార్గంలో నడవాలని అన్నారు. సమావేశంలో దళిత నాయకులు నారపాం కృష్ణ, బీఈడీ కంప్లీట్ చేసిన స్టూడెంట్స్, తదితర ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

కొత్త ప్లాంటేషన్లకు అనుమతి ఇవ్వాలి



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మికులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో వన సంరక్షణ సమితుల్లో పనిచేస్తున్న పేదల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్త ప్లాంటేషన్లకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అటవి ప్రాంత పేదలు వన సంరక్షణ సమితుల సమైక్య జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా రేంజర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని అటవీ ప్రాంత భూముల్లో పేదలు, దళితులు గత 25 ఏళ్ల నుంచి సాగు చేస్తూ జామాయిలు, వెదురు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రధానంగా ఏలూరు జిల్లాలో జామాయిల్ పంట విస్తారంగా వేశారని చెప్పారు. నిబంధనల ప్రకారం ఐదు నుంచి ఏడేళ్ల మధ్య వచ్చిన పంటను కటింగ్‌కు ఆర్డర్ ఇవ్వాలన్నారు. అటవీ ప్రాంతంలో పేదలకు వ్యవసాయం పనులు లేని నేపథ్యంలో వన సంరక్షణ సమితులు పేదలకు అండగా ఉంటున్నాయని, వాటిల్లో వివిధ రకాల పంటలు వేసుకుని భూమిని సాగు చేస్తున్నారని వివరించారు. అటవీ ప్రాంత పేదలు, వన సంరక్షణ సమితుల్లో పనిచేస్తున్న కూలీలకు వేతనాలు ఇవ్వాలని, కొత్త వీఎస్ఎస్ ప్లాంటేషన్లు ఇవ్వాలని, కటింగ్ వచ్చిన ప్లాంటేషన్లు కటింగ్ అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏలూరు రేంజర్ కుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమలో జిల్లా వీఎస్ఎస్ సభ్యులు జయరాజు, అంజయ్య, ప్రసాద్, కనకరాజు, కృపా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాబురావు, దాసు, తోచిలక రాయుడుపాలెం, కొత్తపల్లి, ఉంగుటూరు, గొల్లగూడెం తదితర గ్రామాల నుంచి వీఎస్ఎస్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల భద్రత, ర్యాగింగ్‌పై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని ప్రైవేటు కళాశాలలో విద్యార్థులకు మహిళల భద్రత, సైబర్ క్రైమ్, డ్రగ్స్, ర్యాగింగ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, మహిళా ఎస్సై కాంతి ప్రియ మాట్లాడుతూ ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో మహిళలు వెంటనే 112 లేదా 7993485111 (శక్తి) నెంబర్‌కు కాల్ చేయవచ్చని అన్నారు. ఈ నెంబర్ ద్వారా తక్షణ సాయం అందుబాటులో ఉంటుందని, శక్తి యాప్‌ను ప్రతి మహిళా తన మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఈ యాప్ ద్వారా అత్యవసర సమయంలో ఒకే క్లిక్‌తో సహాయం కోరవచ్చన్నారు. విమెన్ డ్రాప్ వాహనం మన జిల్లాలో రాత్రి 10 నుంచి ఉదయం 5 గంటల వరకు మహిళలకు హోమ్ డ్రాప్ వాహన సేవ అందుబాటులో ఉందని తెలిపారు. రాత్రి సమయంలో ఎవరైనా ఒంటరి మహిళలు సురక్షితంగా ఇంటికి చేరేందుకు ఈ వాహనాన్ని వినియోగించుకోవచ్చని సూచించారు. కళాశాలలో ర్యాగింగ్ పూర్తిగా నిషేధమని, ర్యాగింగ్ చేస్తే కఠినమైన శిక్షలు విధించబడతాయని హెచ్చరించారు. డ్రగ్స్ వాడకం, ఆన్‌లైన్ గేమ్స్ వల్ల విద్యార్థులు దారి తప్పే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై నిత్యం నిఘా పెట్టాలని, అవసరమైతే కౌన్సెలింగ్ సెంటర్ల సహాయం తీసుకోవాలన్నారు. సైబర్ మోసాలు జరిగినప్పుడు వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, మీ డేటా, డబ్బు సురక్షితంగా ఉండేందుకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చదువును పక్కనబెట్టి తప్పు మార్గంలో వెళ్తున్న విద్యార్థులకు తాము కౌన్సెలింగ్ సెంటర్ల ద్వారా సహాయం అందిస్తున్నామని, తమ దగ్గర ఒన్ స్టాప్ సెంటర్, భూమిక ఉమెన్స్ కలెక్టివ్ సెంటర్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

పారిజాతగిరిని సందర్శించిన జేసీ, ఎస్పీ



ఎస్పీ కిషోర్, జేసీ ధాత్రి, ఆర్డీవో ఎంవీ రమణలకు వేదాశీర్వాదం, ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: ప్రపంచ యోగా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా జంగారెడ్డిగూడెం వచ్చిన జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి దంపతులు మంగళవారం పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో మానికల రాంబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఎస్పీ, జేసీలకు వేదాశీర్వాదం అందించి, స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. వీరి వెంట ఆర్డీవో ఎంవీ రమణ, డీఎస్పీ యు.రవిచంద్ర, తహసిల్దార్ కె.స్లీవ జోజి, సీఐ వి.కృష్ణబాబు, ఎస్సై షేక్ జబీర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలో..

యోగా దినోత్సవం అభ్యాసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మద్ది క్షేత్రంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి దంపతులు మద్ది ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆలయ ఈవో ఆర్‌వీ చందన అందజేశారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

వేలేరుపాడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు వెంటనే బకాయిలు చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు మంగళవారం నిరసన వ్యక్తం చేసి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధి పని చేసే వారికి కూలి సక్రమంగా అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కారం ధారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, బంధం అర్జున్, తాటి దుర్గారావు, బంధం నాగేశ్వరరావు, యర్ర మధు, కురిమెళ్ళ వెంకటేశ్వర్లు, సుడే ప్రసాద్, కంగాల గంగరాజు, తెల్ల మహేష్, సోడే సత్తిబాబు, కరక ముత్యాలు, బుడిపిటి జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

18న సీపీఐ బైక్ ర్యాలీలు

చింతలపూడి: సీపీఐ ఏలూరు జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఈనెల 18వ తేదీన జిల్లా వ్యాప్తంగా బైక్ ర్యాలీలు నిర్వహించాలని మహా సభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు మామిళ్లపల్లి వసంతరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతలపూడి పట్టణంలో జూలై 5, 6, 7 తేదీల్లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సహాయ కార్యదర్శి ఉప్పులూరు హేమశంకర్, రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, సన్నేపల్లి సాయిబాబా, జంపన వెంకట రమణ రాజు, కొండేటి బేబి, ఆహ్వాన సంఘం కార్యదర్శి తుర్లపాటి బాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.సోమశేఖర్, టీవీఎస్ రాజు, కె.బుచ్చిబాబు, టి.ఆంజనేయరాజు, దొంతా కృష్ణ, పాల్గొన్నారు.

ఎండీఎం బియ్యాన్ని పాఠశాలలకు తరలించాలి



ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న జేసీ పి.ధాత్రిరెడ్డి

జంగారెడ్డిగూడెం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి బియ్యాన్ని ఈ నెల 11వ తేదీ బుధవారం నాటికి అన్ని పాఠశాలలకు తరలించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. మంగళవారం పట్టణంలో గల ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలకు పంపే బియ్యాన్ని ఆమె పరిశీలించారు. గోడౌన్‌లో ఉన్న స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. అనంతరం పట్టణంలో గల పద్మ థియేటర్ సమీపంలో ఉన్న 37వ రేషన్ షాపును ఆమె తనిఖీ చేశారు. అలాగే దివ్యాంగులకు, వృద్ధులకు త్వరితగతిన ఇంటికే రేషన్ సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎంవీ రమణ, తహసీల్దార్ కె.స్లీవజోజీ, సీఎస్ జిల్లా మేనేజర్ శివమూర్తి, సీఎస్‌డీటీ సీహెచ్ వెంకటేశ్వరరావు, డీటీ రమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల ఆకస్మిక మృతి



కొయ్యలగూడెం మండలం గవరవరంలో మృతి చెందిన పశువులు

కొయ్యలగూడెం: గవరవరం గ్రామ సమీపంలోని ఒక రైతుకు చెందిన పశువులు మంగళవారం మృతి చెందడం రైతుల్లో కలకలం రేపింది. కౌలుకు వ్యవసాయం చేసే గుర్తి శ్రీనివాస్, అతడి సోదరులు పదిహేను పశువులను మేపుతున్నారు. అయితే ఇందులో తొమ్మిది పశువులు అస్వస్థతకు గురయ్యాయి. అస్వస్థతకు గురైన వాటిలో ఐదు పశువులు మృత్యువాత పడ్డాయని వెటర్నరీ డాక్టర్ బీఆర్ శ్రీనివాస్ తెలిపారు. మిగిలిన నాలుగు పశువులకు కూడా ప్రాణాపాయ స్థితికి వెళ్లగా వాటికి చికిత్స అందిస్తున్నామన్నారు. పశు పోషకులు ఉన్న ప్రాంతం, పశువులు మేసిన ఆహారం, నీరు కలుషితమై ఉండొచ్చని విష ప్రభావం చేత ప్రమాదానికి గురై ఉంటాయని శ్రీనివాస్ తెలిపారు. చికిత్స తీసుకుంటున్న పశువుల నుంచి, మిగిలిన పశువుల నుంచి శాంపిల్స్ సేకరించామని ల్యాబ్ రిపోర్ట్ అనంతరం పశువుల మృతికి గల కారణాలు వెల్లడవుతాయన్నారు. మృతి చెందిన పశువుల విలువ మూడు లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. కాగా గత ప్రభుత్వం వరకు బీమా సౌకర్యం అమలు చేశారని, అనంతరం బీమా సదుపాయం ఎత్తివేయడంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయారు. పశువుల మీదే ఆధారపడి జీవిస్తున్న తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని అశోక్ నగర్ సబ్ స్టేషన్ ఆర్టీసీ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని నరసింహరావు పేటలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఐటీడీఏలో మెగా జాబ్ మేళా




ఐటీడీఏలో జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులతో పీఓ రాములు నాయక్

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో నేషనల్ కెరియర్ సర్వీస్, ఐటీడీఏ సంయుక్తంగా వైటీసీ మీటింగ్ హాల్‌లో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్, పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్ మేళాలో 11 మంది అభ్యర్థులను అతిపెద్ద చాక్లెట్ తయారీ సంస్థకు ఎంపిక చేసి ఉద్యోగ ఆఫర్ లెటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

దెందులూరు: వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ చాటపర్రులో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పని దినాలు కల్పించి, రోజుకు రూ.700 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు లేని పేదలకు మూడు సెంట్లు స్థలం, రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వాలు అందించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా అమలు చేయాలన్నారు. గ్రామాల్లో భూమిలేని పేదలకు ప్రభుత్వంలోని అన్ని రకాల మిగులు భూములను పంపిణీ చేయాలని కోరారు. కేరళ రాష్ట్రం వలే గ్రామీణ వ్యవసాయ కార్మికులకు సమగ్ర ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అనంతరం వ్యవసాయ కార్మికుల సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ ఏలూరు మండల కార్యదర్శి పొట్టేళ్ల పెంటయ్య, నాయకులు బుగ్గల ప్రభాకర్, అరిగెల యోహాన్, కె.మంగమ్మ, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, జిల్లా నాయకులు పి.కిషోర్, బి.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు



జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు సర్వే చేస్తున్న ఎస్సై కట్టా శారదా సతీష్

పెదపాడు: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెదపాడు మండలంలోని కలపర్రు జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. పెదపాడు మండలంలోని కలపర్రు గ్రామంలో ఏలూరు పోలీసు కంట్రోల్ రూం సీఐ అఖిల్ జామా ఆధ్వర్యంలో ఎస్సై కట్టా శారద సతీష్, డీటీఆర్‌బీ మధు, రోడ్డు సేఫ్టీ సిబ్బందితో కలిసి జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో పెదపాడు పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన శాంతియుతంగా ఉండాలి

దెందులూరు: ఏదైనా అభ్యంతర విషయాలు ఉంటే నిరసన శాంతియుతంగా చేయాలే తప్ప పత్రిక కార్యాలయాలకు వెళ్లి తగలబెట్టడం మంచి సంప్రదాయం కాదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఖండించారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ టీవీ డిబేట్‌లో పాల్గొన్న వారు చెప్పింది ఆ ఛానల్‌కు, యాజమాన్యానికి ఆపాదించడం ఏ మాత్రం తగదన్నారు. రాజకీయ పార్టీలు ఏ కార్యక్రమం చేసినా హుందాగా ఉండాలన్నారు. రాజకీయాలు భావితరాలకు ఆదర్శప్రాయంగా నిలవాలే తప్ప ఈ తరహాలో పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం హర్షించదగ్గ విషయం కాదన్నారు. అధికారం ఏ ఒక్కరికీ శాశ్వతం కాదని భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాజకీయ పార్టీలు పాలన సాగించాలని కామిరెడ్డి నాని అన్నారు.

ప్రజల పాలిట ఉరితాళ్లు.. స్మార్ట్ మీటర్లు

భీమడోలు: ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారే విద్యుత్ స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు పిలుపు నిచ్చారు. భీమడోలులోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం మండల సమావేశాన్ని నిర్వహించారు. మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు, విద్యుత్ చార్జీలు తగ్గించాలన్న పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సమావేశానికి నాయకులు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఆర్.లింగరాజు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం నిరంకుశ చర్యల్లో భాగంగా ఆదానీకి అనుకూలమైన ఈ స్మార్ట్ మీటర్లను ముందుకు తీసుకొచ్చారన్నారు. తెచ్చారన్నారు. గత ప్రభుత్వ హయంలో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌లు స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టాలని పిలుపు నిచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి అదే విధానాన్ని అమలు చేయడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల నెత్తిన చార్జీల భారం మోపేందుకు కంకణం కట్టుకుందన్నారు. ప్రజలే ఈ దుర్మార్గ నిర్ణయాలను తిప్పి కొట్టాలని వారికి సీపీఎం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, నాయకులు పి.నాగరాజు, టి.రత్తయ్య, మానుకొండ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	24
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	01
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	08
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	11
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	08
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - తిరుపతి	16.00	4830	33